క్లుప్తంగా

వేంకటేశ్వరునికి ద్వాదశ ఆరాధన



పూజలు చేస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ద్వాదశ ఆరాధన పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో కేవీఎస్ భాస్కరరావు, సీతా నాగేశ్వర దంపతులచే అర్చకులు శ్రీనివాసాచార్యులు శ్రీవారికి పలు రకాల పుష్పాలతో పూజలు చేశారు. సోమవారం ఉదయం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మందిర కార్యదర్శి కుక్కల బాల, సరిపిడకల రామారావు, జానపాటి మధు, పెన్నాడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, నళిని మోహన్, మామిడిశెట్టి జయ కుమార్, కట్టా లక్ష్మణస్వామి, ప్రగఢ సుబ్బారావు, కడలి ఫణికుమార్, పద్మావతి మహిళా పారాయణం బృందం పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు చండీ హోమం నిర్వహించారు. 52 మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి తెలిపారు. అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వాడవాడలా కార్మిక శక్తి చాటాలి




సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

భీమవరం: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని వాడవాడలా ఎర్రజెండాలు ఆవిష్కరించి, కార్మిక శక్తిని చాటాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. మేడే వేడుకల సన్నాహాల్లో భాగంగా శనివారం భీమవరం కామాక్షమ్మ దేవాలయంలో మున్సిపల్ వర్కర్స్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిలారి మల్లేశ్వరరావు మాట్లాడుతూ మేడే రోజున ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్మికుల అపరిష్కృత డిమాండ్ల సాధనకు మే 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. చెల్లబోయిన రంగారావు, నీలాపు శ్రీను, రెల్ల రాము, నీలాపు చిత్తరంజన్ పాల్గొన్నారు.

చర్చి స్థలంలో మున్సిపల్ ఆఫీసు సరికాదు

ఆకివీడు: క్రైస్తవ మైనార్టీకి చెందిన చర్చి స్థలంలో మున్సిపల్ కార్యాలయం నిర్మించాలని అజెండాలో పొందుపరచడం సరికాదని ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ టౌన్ కార్యదర్శి గూడపాటి జోసఫ్ అన్నారు. ఈ నెల 30వ తేదీన మున్సిపల్ సమావేశంలో అజెండాకు చర్చించనున్న సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక అయిభీమవరం రోడ్డులోని సర్వే నంబర్ 473లో 2.80 సెంట్లు భూమిని 1891లో క్రేక్ దొర కొనుగోలు చేసి, స్థానిక సంఘానికి అప్పగించారన్నారు. అప్పట్లోనే రిజిస్ట్రేషన్ చేయించారని, ఈ భూమికి సంబంధించిన అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని జోసఫ్ రాజు చెప్పారు. దీనిపై నగర పంచాయతీ ముందుకు వెళ్లకుండా క్రైస్తవ సంఘానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సాయిబాబుకు సత్కారం



సాయిబాబును సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం గీతా మందిరం వేదికగా తాడేపల్లిగూడెంలో అష్టావధానం నిర్వహించారని పంపన సాయిబాబు ఆదివారం తెలిపారు. తెలుగు సాహిత్యంలో అవధానం ఒక విశిష్ట ప్రక్రియని, అవధానంలో అనేక అంశాలు ఉంటాయని ఒక్కో అంశాన్ని ఒక్కో పండితుడు నిర్వహిస్తాడన్నారు. రంగస్థలం కళాకారుల సంఘం తెన్నేటి నరసింహమూర్తి, ఆర్‌వీఎస్ రాజు అష్టావధాన పండితులను ఘనంగా సత్కరించారు. పలువురు ఉపాధ్యాయులు మండల నాయకులు సాయిబాబుకు అభినందనలు తెలిపారు.

క్రాప్ హాలిడేతో ఉపాధి గండం

- రైతు బజార్లను ఆశ్రయిస్తున్న ఆక్వా రైతులు
- మరిన్ని అమ్మక కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధం
- సుంకాల పేరుతో రొయ్య ధర పతనం



బజార్‌లో శుభ్రం చేసిన రొయ్యలను అమ్ముతున్న ఆక్వా రైతులు

భీమవరం: రొయ్యల రైతుల అవస్థలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పటికే కొంతమంది రైతులు ఆక్వా క్రాప్‌హాలీడే ప్రకటించారు. దీంతో ఆక్వా రంగంపై ఆధారపడిన అనేక మందికి ఉపాధి కరువైంది. మరికొంతమంది రైతులు స్థానిక మార్కెట్‌ను పెంచుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా భీమవరం పట్టణానికి చెందిన ఆక్వా రైతు, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదిరాజు వెంకట సుబ్బరాజు ఆదివారం భీమవరం రైతు బజార్‌లో శుభ్రం చేసిన రొయ్యల అమ్మకం ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా పూర్తిగా శుభ్రం చేసిన రొయ్యలను రూ.100 నుంచి పలు ధరల్లో లభించే విధంగా ప్యాకింగ్ చేసి విక్రయాలు చేపట్టారు. మన ప్రాంతంలో పండించే రొయ్యలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. స్థానికంగా వినియోగం అంతంత మాత్రమే. దీంతో కరోనా సమయంలోనూ, అమెరికా సుంకాల పెంపుతో రొయ్యల ధర గణనీయంగా తగ్గిపోయింది. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఆక్వా సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

గత ప్రభుత్వంలో పటిష్ట చర్యలు

అయితే కరోనా సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రొయ్యల ధరలు నిలకడగా ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో అప్పట్లో రైతులు ఊరట చెందారు. అయితే ఇటీవల అమెరికా పన్నుల కారణంగా అన్ని కౌంట్ రొయ్యల ధరలు భారీగా పతనమయ్యాయి. రొయ్యల సాగులో ఉపయోగించే సీడ్, ఫీడ్ ధరలు పెరగడంతో ఆక్వా సాగు రైతులకు గిట్టుబాటు కాక ఇప్పటికే అనేక మంది రైతులు క్రాప్‌హాలీడే ప్రకటించారు. అయినప్పటికీ ప్రభుత్వ పరంగా పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తుండగా లక్షలాది మంది రైతులు, కార్మికులు, ఇతర వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇటువంటి తరుణంలో క్రాప్ హాలీడే ప్రకటించడం వలన వీరంతా ఉపాధి కరువై రోడ్డున పడే అవకాశముంది.

పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీవీఎల్ నర్సింహరాజును మర్యాదపూర్వకంగా కలిసిన జాషువా చినకృష్ణమూర్తి

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం అన్నింటా విఫలం కావడంతో ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పాలన చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ప్రతి రోజూ తలచుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మేధావి విభాగం మండలాధ్యక్షుడు, యండగండి గ్రామ సర్పంచ్ గోగులమండ చిన కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రాష్ట్ర మేధావి విభాగం అధికార ప్రతినిధిగా నూతనంగా నియామకమైన ఈదా జాషువా (యెహోషువా) తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పీవీఎల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు ఇంతటి పదవీ భాధ్యతను అప్పగించినందుకు నాయకులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవకర్గ పీవీఎల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం ఇస్తున్నారని దీనిలో భాగంగానే నూతన నియమాకాలు చేపట్టారని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారన్నారు. చేసిన వాగ్దానాలను పూర్తిగా గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కూటమి నాయకులు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని అన్నారు. కార్యక్రమంలో కమతం మహేష్, మాక్సివెల్, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కాళ్ల: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసిన వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పిలుపు ఇచ్చారు. కాళ్ల మండలం పెద అమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆకివీడు మండలం ఆకివీడు గ్రామానికి చెందిన గ్రామానికి ఈదా యహోషువా ఇంటెలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి (స్పోక్స్ పర్సన్)గా నియమితులైన సందర్భంగా ఆదివారం ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యండగండి గ్రామ సర్పంచ్ గోగులమండ నాని కమతం మహేష్, గేదెల జాషువా, తదితరులు పాల్గొన్నారు.

వరి కోత యంత్రం అడ్డగింతపై ఫిర్యాదు



రైతుతో మాట్లాడుతున్న ఆర్ఐ వంటపాటి ఆంజనేయులు

ఆకివీడు: రైతువారీ పనులకు ఆటంకం కలిగిస్తే సెక్షన్ 251 ప్రకారం చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని దుంపగడప గ్రామంలో మూల లంక, దుబ్బుకోడు ఆయుకట్టులోని రైతు కడియం ప్రసాద్ వరి కోత యంత్రం పొలంలోకి వెళ్లడంతో అడ్డుకున్న సంఘటనపై ఆ ప్రాంత రైతులు తహసీల్దార్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతోనూ, వరి కోత మిషన్‌ను అడ్డుకున్న రైతు ప్రసాద్‌తో సంప్రదింపులు చేశారు. దీంతో రైతు ప్రసాద్ తన పొలం గట్టు నుంచి వరి కోత యంత్రాన్ని ఇతర రైతుల పొలంలోకి వెళ్లేందుకు మార్గం కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు కొట్టు మాణిక్యాలరావు, చేగొండి రమేష్‌బాబ, రామిశెట్టి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధుల నివారణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణంరాజు

భీమవరం: గుండె వ్యాధుల నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి వ్యాయామం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం వలన గుండె ఆరోగ్యంగా ఉంటుందని హైదరాబాద్ కేర్ హాస్పిటల్ ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పెన్మెత్స కృష్ణంరాజు అన్నారు. భీమవరం చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనంద పంక్షన్ హాల్‌లో ఆదివారం గుండె చప్పుడు–గుండె జబ్బుల నివారణపై ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణంరాజు మాట్లాడుతూ చిన్న పిల్లలతో సహా అన్ని వయసుల వారు ఎక్కువగా గుండె సంబంధిత రోగాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. పీఆర్‌కే వర్మ, రాయప్రోలు భగవాన్, భట్టిప్రోలు శ్రీనివాసరావు బొండా రాంబాబు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, కె.సత్యనారాయణ, కేవీ రమణమూర్తి, పేరిచర్ల లక్ష్మణ వర్మ, కె.సత్యకుమార్, పెన్నాడ శ్రీనివాస్, వైద్యులు పాల్గొన్నారు.

15 రోజుల్లో మిగిలిన ఆక్రమణలు తొలగిస్తా

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కాళ్ల: మరో 15 రోజుల్లో ఉండి నియోజకవర్గంలోని మిగిలిన ఆక్రమణలను తొలగిస్తానని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు స్పష్టం చేశారు. ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల తొలగింపును నిరసిస్తూ ఒక పక్క బాధితులు, పలు పార్టీలు, ప్రజా సంఘాల నేతలు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. మరో పక్క కాళ్ల మండలం పెద అమిరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రఘురామకృష్ణరాజు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పంట, మురుగు కాలువలపై ఆక్రమణలు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని, ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు మండలాల్లో అన్ని వర్గాల వారి ఆక్రమణలనూ తాము తొలగించామని ఆయన చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తనను బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. ముందు ఆయనే తనకు క్షమాపణ చెప్పాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని తొలగించకపోతే తనపై ఆరోపణలు చేయాలని అన్నారు.

ఉగ్ర దాడులు దురదృష్టకరం



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

భీమవరం: భారతదేశం శాంతికి సమైక్యతకు ప్రపంచానికి మార్గ దర్శకమని, శాంతి పథంలోనే త్యాగధనుల త్యాగంతో స్వాతంత్రం సాధించుకున్న మన దేశంలో కాశ్మీర్‌లో జరిగిన మారణ హోమానికి ప్రపంచ మానవాళి దిగ్భ్రాంతి చెందారని సెయింట్ పాల్ లూథరన్ దేవాలయం చినపేట పాస్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కాశ్మీర్ ఉగ్రవాదుల దాడులకు నిరసనగా శాంతి ప్రార్థనలు నిర్వహించి, మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వెన్నపు సుజ్ఞానరావు, తోకల శేఖర్, పట్టిం సురేష్, సోడదాసి యాకోబు, మాణిక్యాలరావు, కొండ్రు శ్రీనివాస్, యిమ్మడి సుందర్ పాల్గొన్నారు.

దేశ సమైక్యత దెబ్బతీసేందుకే ఉగ్ర దాడి

ఆకివీడు: ప్రపంచంలోనే అత్యంత సామరస్యంతో, సమైక్యతతో ఉన్న భారత దేశంలో కల్లోలం సృష్టించేందుకు ఉగ్రవాదులు చేస్తున్న దాడిని తిప్పికొట్టాలని స్థానిక సీబీసీఎన్‌సీ చర్చి కార్యదర్శి డాక్టర్ గూడపాటి జోసఫ్‌రాజు పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వత్తుల ప్రదర్శన, ర్యాలీ ఆదివారం నిర్వహించారు. కటికతల సువర్ణరాజు, మాజీ ఎంపీటీసీ ఆనంద్ రాజ్‌కుమార్, కే.ఎలీషా, చిగురుపాటి జోసఫ్, గూడపాటి పమ్ము, ప్రభాకర్, మాజీ ఎంపీపీ కట్టా నాగేశ్వరరావు, చొక్కాపు సుబ్బారావు పాల్గొన్నారు.

